తరం మారినా..సంప్రదాయం వదల్లేక..

- మోటార్ సైకిల్‌పై హరిదాసు
- హ్యాండిల్‌కు అక్షయ పాత్ర.. లౌడ్ స్పీకర్‌లో భక్తి పాటలు
- ఐదు తరాలుగా ఇదే వృత్తి అంటున్న అబ్బులు

అన్నవరం: ఒకప్పుడు ధనుర్మాసం ప్రారంభమైతే చాలు ఏగ్రామంలో చూసినా ×రావమ్మా మహాలక్ష్మి రావమ్మా≀ అంటూ భక్తి గీతాలు ఆలపిస్తూ సూర్యోదయానికి ముందే ఇళ్ల ముందు ప్రత్యక్షమయ్యే హరిదాసులు ప్రస్తుతం అక్కడక్కడ మాత్రమే దర్శనమిస్తున్నారు. అది కూడా మోడ్రన్ పద్ధతిలో మాత్రమే. తలపై అక్షయ పాత్ర ధరించి ఇంటింటికీ తిరిగే హరిదాసులు ఇప్పుడు ఎక్కడా కనిపించడం లేదు. మోటార్ సైకిల్‌కు అక్షయపాత్ర అమర్చి, లౌడ్ స్పీకర్ ద్వారా భక్తి గీతాలను వినిపిస్తూ ఇంటింటికీ తిరుగుతున్నారు.

అన్నవరంలో దశాబ్దాలుగా ధనుర్మాసంలో కాలినడకన ఇంటింటికీ తిరిగే హరిదాసు చల్లా అబ్బులు కూడా ఈ ఏడాది మోటార్ సైకిల్ మీద హరిదాసుగా దర్శనమిచ్చారు. ఇదేంటని అడిగితే వయసు మీద పడింది, నడిచి తిరగలేకపోతున్నానని జవాబు చెప్పారు. హరిదాసు చల్లా అబ్బులు తెలిపిన వివరాలు వింటే ఆశ్చర్యం కలుగక మానదు.

మా కుటుంబంలో నేను ఐదోవాడిని..

మాది భీమవరం దగ్గర గొల్లవాని తిప్ప. మా తాత ముత్తాతలు అందరూ హరిదాసులుగా ధనుర్మాసంలో గ్రామస్తుల భిక్ష స్వీకరించిన వారే. మా తాత వెంకన్న ధనుర్మాసంలో హరిదాసుగా నాలుగు గ్రామాలు కాలినడకన తిరిగేవారు. మా తండ్రి కాటస్వామి కూడా అంతే. మేము ముగ్గురు అన్నదమ్ములం. అన్నయ్యలు సత్తిబాబు, పిచ్చయ్య. మేము ముగ్గురం కూడా హరిదాసు కీర్తనలు, భక్తి పాటలు మా తండ్రి వద్దనే నేర్చుకున్నాం. మా అన్నలిద్దరూ కూడా హరిదాసు లుగా ఇతర గ్రామాలలో తిరిగే వారు. నేను 16 సంవత్సరాల వయసు ఉన్నప్పుడు మా తండ్రి కూడా వచ్చేవాడిని. ఆయన అక్షయ పాత్ర నెత్తిన పట్టుకుని హరినామాలు జపిస్తూ తిరిగేవారు.

25 సంవత్సరాలుగా హరిదాసు సేవలో ..

నేను 25 సంవత్సరాలుగా హరిదాసుగా సేవ చేస్తున్నారు. ధనుర్మాసంలో వెళ్లని గ్రామాలకు మాఘ మాసంలో వెళ్లేవాడిని. నడిచి తప్ప ఎప్పుడూ ఇలా బైక్ మీద తిరగలేదు. ఇప్పుడు నాకు 50 సంవత్సరాలు దాటాయి. ఒంట్లో సత్తువ తగ్గింది. ఇక సేవ చేయను అంటే మా అమ్మ ఒప్పుకోలేదు. సంప్రదాయం వదలకూడదు అంది. నాకు కొడుకులు లేరు. నా మనవుడు ప్రసన్నకు కూడా ఈ కీర్తనలు నేర్పించాను. నా తరువాత అతడే హరిదాసుగా సేవ చేస్తాడు.

ఇతర రోజుల్లో వ్యవసాయ పనులే జీవనోపాధి

ధనుర్మాసంలో హరిదాసుగా సేవ చేస్తాం. మిగిలిన రోజుల్లో వ్యవసాయ పనులకు వెళ్లి జీవనోపాధి పొందుతాం. హరిదాసు సేవలో భక్తులు సమర్పించిన బియ్యం, కానుకల్లో కొంత మొత్తంతో అన్నసమారాధన చేస్తాం. మిగిలినవి ఒకటి రెండు నెలలు జీవనోపాధికి వస్తాయి.

పింఛన్లు ఇవ్వడం లేదు

గతంలో హరిదాసులను కళాకారులగా గుర్తించి పింఛన్లు ఇస్తామన్నారు. కాని ఇప్పటివరకూ మాకు పింఛన్లు ఇవ్వలేదు. ప్రస్తుతం అందరికీ పింఛన్లు ఇస్తున్నారు. మాకు కూడా పెన్షన్ ఇచ్చి ఆదుకోవాలి.



మోటార్ సైకిల్‌పై తిరుగుతున్న హరిదాసు అబ్బులు

ఉత్తమ సేవలకు గుర్తింపు

కిర్లంపూడి: ఉత్తమ సేవలకు అరుదైన గౌరవం దక్కుతుందని కిర్లంపూడి సొసైటీ చైర్మన్ చదలవాడ బాబీ, వైఎంఎస్‌సీ చైర్మన్ పెంటకోట నాగబాబు అన్నారు. గత 38 ఏళ్లుగా కిర్లంపూడి సొసైటీలో అనేక పదవులు చేసి సెక్రటరీగా పదవీ విరమణ పొందిన వెలగా వెంకటరమణను శనివారం స్థానిక సొసైటీ, మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన ప్రతిఒక్కరికీ మంచి గుర్తింపు, గౌరవం లభిస్తాయన్నారు. సొసైటీ సెక్రటరీగా వెంకటరమణ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, సొసైటీ సీఈఓ కట్టా రాజబాబు, సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన



ఏలేశ్వరంలో నగర సంకీర్తన చేస్తున్న భక్తులు

ఏలేశ్వరం: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలో శనివారం తెలవారుజామున నగర సంకీర్తన నిర్వహించారు. పట్టణానికి చెందిన భజంతుల లక్ష్మణరావు ఆధ్వర్యంలో భక్తులు హరేరామ్..హరే కృష్ణ నినాదాలతో నగర సంకీర్తన చేశారు. భజనబృందాల నేతృత్వంలో మహిళలు భక్తిగీతాలు ఆలపించారు. ధనుర్మాసం ముగిసే వరకూ నగర సంకీర్తన నిర్వహిస్తామని లక్ష్మణరావు తెలిపారు.







విద్యకు అధిక ప్రాధాన్యం



బలరామపురం హైస్కూల్‌లో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు చినదివాణం

రౌతులపూడి: ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం అన్నారు. మండలంలోని బలరామపురం, ములగపూడి జిల్లా పరిషత్ హైస్కూళ్లు, ఎస్.పైడిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ఎంపీపీ రాజ్యలక్ష్మి, ప్రజాప్రతినిధులతో కలసి శనివారం ఆయన ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వసతులు కల్పిస్తున్నారన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి తాతాజీ, రాయి ప్రసాద్, మండల కో ఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



ఏలేశ్వరంలో విద్యార్థినులకు ట్యాబ్‌లు అందజేసిన వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: స్థానిక సాంఘిక సంక్షేమశాఖ గురుకుల బాలికల పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, సుంకర రాంబాబు బైజూస్ ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. పేద విద్యార్థులకు సైతం సాంకేతిక విద్యను అందించేందుకు ట్యాబ్‌లు పంపిణీ చేశారన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మసిరపు నాగేశ్వరరావు, కోనాల వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు శ్రీపుష్పయాగం

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం స్వామి, అమ్మవార్లకు శ్రీపుష్పయాగం నిర్వహించనున్నట్టు దేవస్థానం చైర్మన్ కోలా భీమేశ్వరరావు శనివారం తెలిపారు. నూతన సంవత్సరం ప్రారంభాన్ని పురస్కరించుకుని ఉదయం 5 గంటల నుంచి స్వామివారి దర్శనాలకు భక్తులను అనుమతిస్తామన్నారు. ధనుర్మాసం సందర్భంగా స్వామివారికి వివిధ రకాల పుష్పాలతో పూలంగి సేవ, శ్రీపుష్పయాగం నిర్వహిస్తామని చెప్పారు.

రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో ప్రతిభ



ప్రతిభ చూపిన పావనిగాయత్రిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎస్.పావనిగాయత్రి రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో ప్రతిభ కనబరిచి తృతీయ స్థానం పొందినట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరెడ్డి శనివారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 30న కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి యువజనత్సోవాల్లో పావనిగాయత్రి పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా ఆమెను పిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.









పలు దుకాణాల్లో చోరీ

రౌతులపూడి: మండల కేంద్రమైన రౌతులపూడి ప్రధాన రహదారిలోని పలు దుఖాణాల్లో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఈ మేరకు శనివారం బాధిత దుకాణాల యజమానులు అన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక గుమ్మరేగుల సెంటర్‌లోని ఆర్ఎస్ ట్రేడర్స్ కిరాణా షాపు గోడలు బద్దలుకొట్టి దుండగుడు చోరీకి పాల్పడినట్లు షాపులో ఏర్పాటు చేసిన సీసీ పుటేజ్‌లో నమోదైంది. షాపులో సుమారు రూ.10వేల నగదు చోరీకి గురైనట్టు షాపు యజమాని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే స్థానిక సీహెచ్‌సీ ఎదురుగా ఉన్న ఎలక్ట్రికల్ షాపులోనూ, కృష్ణుడి గుడి వద్ద ఉన్న ఊటా నూకరాజు షాపులోనూ, 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని అల్లు జమీలుకు చెందిన పాన్ షాపులోనూ వరుసగా చోరీలు జరిగినట్టు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అన్నవరం పోలీసులు సంఘటన స్థలాలను పరిశీలించారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

















రత్నగిరికి పోటెత్తిన భక్తులు

- సత్యదేవుని దర్శించిన 30 వేల మంది
- దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం


సత్యదేవుని దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

అన్నవరం: రత్నగిరివాసుడు సత్యదేవుని శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించి పూజలు చేశారు. ఈ ఆంగ్ల సంవత్సరంలో ఇదే చివరి రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి స్వామివారి దర్శనానికి భక్తులు తరలి వచ్చారు. వీరంతా స్వామివారి వ్రతాలాచరించి దర్శనం చేసుకున్నారు. రత్నగిరిపై ఉదయం ఐదు గంటల నుంచి సాయంత్రం వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. స్వామివారిని 30 వేల మంది దర్శించారు. స్వామివారి వ్రతాలు సుమారు రెండు వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరింది. సుమారు నాలుగు వేల మంది భక్తులకు సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. నూతన సంవత్సరం , సెలవు దినం కావడంతో ఆదివారం కూడా దేవస్థానంలో భక్తుల రద్దీ కొనసాగే అవకాశం ఉంది.

ఘనంగా ప్రాకారసేవ

రత్నగిరిపై ఉదయం ఏడు గంటలకు సత్యదేవుని ప్రాకారసేవ ఘనంగా నిర్వహించారు. తొలుత పల్లకీ మీద స్వామి, అమ్మవార్లను ప్రతిష్ఠించి పూజలు చేశారు. అనంతరం వేదమంత్రాలు, బాజాభజంత్రీల నడుమ ఆలయ ప్రాకారంలో స్వామి అమ్మవార్లను ఊరేగించారు. కొండదిగువన గ్రామోత్సవం నిర్వహించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గోకవరం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు స్థానిక ఏఎస్సై సత్యనారాయణ శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే...కోరుకొండ మండలం కూనవరం గ్రామానికి చెందిన పసుపులేటి కొండయ్య (30) వీరలంకపల్లిలోని ఇటుకల బట్టీలో పని చేస్తున్నాడు. డిసెంబర్ 26న బైక్‌పై శ్రీరంగపట్నం వెళుతుండగా అష్టలక్ష్మీ అమ్మవారి గుడి వద్ద బైక్ అదుపుతప్పి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతడిని కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దరఖాస్తులకు 3 వరకూ గడువు

గోకవరం: మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి జనవరి 3 వరకు గడువు ఉందని కోరుకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఝాన్సీరాణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తపల్లి-8 అంగన్‌వాడీ కేంద్రంలో ఓసీ(హెచ్‌హెచ్), తంటికొండ-1 కేంద్రంలో బీసీ-డి సామాజిక వర్గాలకు కేటాయించారన్నారు. స్థానిక వివాహిత మహిళలు అర్హులన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై జూలై 2022 నాటికి 21-35 సంవత్సరాల లోపు వయస్సు ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు కోరుకొండ సీడీపీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

జగ్గంపేట: స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థులకు శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. అనిమియా ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది 416 మంది విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి గౌతమి, పాఠశాల ప్రిన్సిపాల్ రాజకుమారి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

బోట్‌క్లబ్: స్థానిక టౌన్‌హాల్ కమిటీ ఆధ్వర్యంలో శీతాకాలం సందర్భంగా రూ. లక్ష విలువైన 300 దుప్పట్లను శనివారం పంపిణీ చేశారు. కమిటీ అధ్యక్షుడు కర్రి భామిరెడ్డి, కార్యదర్శి గొల్లపల్లి రామారావు ఆధ్వర్యంలో స్థానిక ఫ్రెండ్స్ కాలనీలో గిరిజన విద్యార్థులతో పాటు పేదలకు దుప్పట్లు అందజేశారు. భామిరెడ్డి మాట్లాడుతూ 140 ఏళ్ల చరిత్ర కలిగిన లిటరరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యుల సహకారంతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యదర్శి గొల్లపల్లి రామారావు, క్లబ్ సభ్యులు పట్నాల మూర్తి, జ్యోతుల రాము, యాళ్ల చిన బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలకు సిద్ధం కావాలి

కాకినాడ సిటీ: కార్మిక హక్కుల రక్షణకు సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. సీఐటీయూ రాష్ట్ర మహాసభలు ఈ నెల 2, 3, 4 తేదీల్లో భీమవరంలో జరుగనున్న నేపథ్యంలో కార్మిక చైతన్య యాత్రలు నిర్వహిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా మందసంలో ప్రారంభమైన ఈ యాత్ర శనివారం మధ్యాహ్నం కాకినాడకు చేరుకుంది. అనంతరం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నర్సింగరావు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మికులను బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. సీఐటీయూ అఖిల భారత ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి, నాయకులు చెక్కల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

కాకినాడ కల్చరల్: స్థానిక ఎస్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళావాహిని భక్తి రస సంగీత సంస్థ ఆడిటోరియంలో సంస్థ 52వ వార్షికోత్సవ వేడుకలు, ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. శనివారం కార్యక్రమాలను సంస్థ అధ్యక్షుడు గోపాలనర్సరాజు ప్రారంభించారు. నృత్యాంజలి నాట్యాచారిణి కృష్ణవేణి శిష్యులు ప్రదర్శించిన నృత్య రూపకాలు ఆకట్టుకున్నాయి. సంకురాత్రి మంజరి సంగీత కళాశాల విద్యార్థులు కీబోర్డుపై భక్తి కీర్తనలు పలికించారు. నాట్య గురువులు కృష్ణవేణి, లోకేష్‌లను సత్కళావాహిని సభ్యులు సత్కరించారు. డాక్టర్ ఈవీ కృష్ణమాచార్యులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

కాకినాడ సిటీ: భవన నిర్మాణ వ్యర్థాలు, చెత్తను నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు పక్కన వేస్తే ఆయా వాహనాలను సీజ్ చేస్తామని కాకినాడ నగరపాలక సంస్థ ఏడీఏ నాగ నరసింహారావు హెచ్చరించారు. శనివారం 9వ డివిజన్ దుమ్ములపేట సమీపంలోని కూరగాయల మార్కెట్‌ను సందర్శించి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు.

క్లుప్తంగా

యాజమాన్య పద్ధతులు పాటించాలి



గండేపల్లిలో క్షేత్రస్థాయి సిబ్బందికి పొలంబడిపై శిక్షణ ఇస్తున్న అధికారులు

గండేపల్లి: రబీ వరి సాగు చేసిన రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు మాధవి సూచించారు. గండేపల్లిలో వ్యవసాయ, ఉద్యాన శాఖ సిబ్బందికి శనివారం వైఎస్సార్ పొలంబడిపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. మోతాదుకు మించి ఎరువులు, పురుగు మందులు వాడరాదన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.సద్గురుమూర్తి , వీఏఏలు, వీహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో తనిఖీలు



బొద్దవరంలో రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న సివిల్ సప్లయి డీఎం పుష్పమణి

కోటనందూరు: మండలంలోని బొద్దవరం, జగన్నాథపురం గ్రామాల్లోని రేషన్ దుకాణాలను సివిల్ సప్లయి జిల్లా మేనేజర్ పుష్పమణి శనివారం తనిఖీ చేశారు. దుకాణాల్లో నిల్వలు, రికార్డులు పరిశీలించారు. తీసుకొచ్చిన సరుకులు, రేషన్ పంపిణీలో పలు అంశాలపై డీలర్లను ఆరా తీశారు. అనంతరం జగన్నాథపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్ర రికార్డులు పరిశీలించి కొనుగోలులో ఉన్న ఇబ్బందులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యాన్ని సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వో శివరామకృష్ణ, రేషన్ డీలర్ల సంఘ కార్యదర్శి చెక్క సాయి పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో జనసేన కార్యకర్తలు

కాకినాడ క్రైం: స్థానిక త్రీ టౌన్ పోలీసులు శనివారం కొందరు జనసేన కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. మెయిన్ రోడ్డులోని వినాయకుడి గుడి సమీపంలో పలు ఫ్లెక్సీలను మున్సిపల్ సిబ్బంది తొలగిస్తుండగా వారు అడ్డుకున్నారు. కేవలం జనసేన ఫ్లెక్సీలే తొలగిస్తున్నారంటూ నిరసనకు దిగారు. ఈ నేపథ్యంలో వారిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

డివిజన్‌లో 144 సెక్షన్

కాకినాడ క్రైం: నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకూ తావు లేకుండా జిల్లా పోలీస్ శాఖ అప్రమత్తమైంది. కాకినాడ రెవెన్యూ డివిజన్ పరిధిలో శని, ఆదివారాలలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్ బాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

రూ.3.63 లక్షల విలువైన సరకు జప్తు

కాకినాడ సిటీ: పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వ, రవాణాపై డిసెంబర్ 24, 31 తేదీల్లో నమోదైన 11 కేసులను విచారించి సీజ్ చేసిన రూ. 3,63,192 విలువైన సరకును ప్రభుత్వానికి జప్తు చేస్తూ ఉత్తర్వులిచ్చినట్లు జేసీ ఇలక్కియ తెలిపారు. వాహన యజమానికి రూ. 50 వేల జరిమానా విధించామన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

కాకినాడ సిటీ: నవరత్నాలు– పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా గృహ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ఆదేశించారు. కాకినాడ సిటీ నియోజక వర్గ లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించిన ఏపీత్రయం, నేమాం లేఅవుట్లను ఆయన శనివారం పరిశీలించారు. ఏపీత్రయంలో 308 మంది లబ్ధిదారులకు ఇప్పటికే 259 మంది ఇళ్ల నిర్మాణానికి ముందుకు వచ్చారన్నారు.

సహకార బ్యాంకు తీరుపై నిరసన

కరప: ధాన్యం సొమ్ము తీసుకోవడానికి కరపలోని డీసీసీబీ బ్రాంచ్ చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోందని రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. పాన్‌కార్డు, ఆధార్‌కార్డు జెరాక్స్ కావాలని, మరోసారి సొమ్ము లేదంటూ బ్యాంకు సిబ్బంది వేధింపులకు గురిచేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. 27న వివిధ బ్యాంకులలోని రైతుల ఖాతాలకు ధాన్యం సొమ్మును ప్రభుత్వం జమ చేసింది. సహకార శాఖ కరప బ్రాంచ్‌లో అకౌంట్లు ఉన్న తమ ధాన్యం సొమ్ము తీసుకోవడానికి మూడు రోజులుగా తిప్పుతున్నారని రైతులు అంటున్నారు.

పల్లెలకు న్యూ ఇయర్ శోభ

- కళకళలాడిన బేకరీలు, బిర్యానీ దుకాణాలు
- ఆటపాటలతో సందడి చేసిన యువత
- గ్రీటింగ్ కార్డులు, వాట్సాప్, ఫేస్‌బుక్‌ల ద్వారా సందేశాలు



ఏలేశ్వరంలో ఏర్పాటు చేసిన గ్రీటింగ్స్ షాపు



తునిలో సిద్ధం చేసిన పూల బొకేలు

ఏలేశ్వరం/తుని: గ్రామాల్లో న్యూ ఇయర్ సందడి నెలకొంది. గతేడాది జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ రాబోయే ఏడాదంతా మంచి జరగాలని కోరుకుంటూ నూతన సంవత్సర వేడుకలు ఆదివారం ఘనంగా జరుపుకొనేందుకు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల ప్రజలు సిద్ధమయ్యారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన గ్రీటింగ్ కార్డుల దుకాణాలు పిల్లలతో కళకళలాడాయి. విద్యార్థులు, యువత తమ స్నేహితులకు, బంధువులకు శుభాకాంక్షలు తెలిపేందుకు గ్రీటింగ్స్ కొనుగోలు చేశారు. పలు ప్రాంతాల్లో బొకేలు, పూలదండల దుకాణాలు వెలిశాయి. వీటి కొనుగోలు ఎక్కువగా ఉండే అవకాశం ఉండడంతో వ్యాపారులు అధిక సంఖ్యలో పూలు, వెరైటీ బొకేలను అందుబాటులో ఉంచారు. 2022 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ యువకులు ఉత్సాహంగా గడిపారు. మహిళలు తమ ఇళ్ల వద్ద కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ముగ్గులు వేశారు.

భారీగా ఏర్పాట్లు

రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజాకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు అభిమానులు తుని రాజా కళాశాల మైదానంలో భారీ ఏర్పాట్లు చేశారు. మంత్రిని కలిసేందుకు వచ్చే నాయకులు, అధికారులు, అభిమానులు పూల దండలు, కేక్‌లకు బదులుగా పుస్తకాలు, పెన్నులు తీసుకరావాలని సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు హల్‌చల్ చేస్తున్నాయి. న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని, నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు.

ప్రసార మాధ్యమాల ద్వారా సందేశాలు

కాలానుగుణంగా మనుషుల అభిరుచులు మారుతున్నాయి. ఒకప్పుడు న్యూ ఇయర్ వేడుకల్లో ప్రధానపాత్ర పోషించే గ్రీటింగ్ కార్డులకు డిమాండ్ తగ్గింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వాట్సాప్, ఫేస్‌బుక్‌ల ద్వారా యువత గ్రీటింగ్స్ చెప్పుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు.

ప్రత్తిపాడు రూరల్: గ్రామాల్లో నూతన సంవత్సర కోలాహలం నెలకొంది. యువత శనివారం మధ్యాహ్నం నుంచి థర్టీ ఫస్ట్ వేడుకల్లో సందడి చేశారు. బేకరీలు, చికెన్, బిర్యానీ, స్వీట్లు, పండ్లు దుకాణాల వద్ద రద్దీ కనిపించింది. కస్టమర్లను ఆకర్షించేందుకు హోటళ్లు, బిర్యానీ దుకాణాల్లో ప్రత్యేక వంటకాలను తయారు చేశారు. అర్ధరాత్రి వరకూ హోటళ్లు, దుకాణాలు వద్ద రద్దీ కొనసాగింది. మహిళలు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఇంటి ముందు రంగు రంగుల ముగ్గులు వేశారు. ఈ ముగ్గులు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి.



ఏలేశ్వరంలో అమ్మకానికి సిద్ధం చేసిన పూలదండలు, బొకేలు



గోకవరంలో సిద్ధం చేసిన కేకులు

గోకవరం: నియోజకవర్గంలో నూతన సంవత్సర సందడి నెలకొంది. పాత సంవత్సరానికి వీడ్కోలు, కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు యువతీ, యువకులు పోటీపడ్డారు. శనివారం థర్టీ ఫస్ట్ సందర్భంగా గోకవరంలో పలు రెస్టారెంట్ల నిర్వాహకులు వివిధ రకాల ఆహార పదార్థాలను సిద్ధం చేశారు. పోటాపోటీగా ఆఫర్లు ప్రకటించడంతో వీటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు ఎగబడ్డారు. కేక్‌ల కోసం యువతీ, యువకులు బేకరీలకు క్యూ కట్టారు. పూలు, పండ్లు, రంగుల దుకాణాలు రద్దీగా మారాయి. మహిళలు తమ ఇళ్ల ముంగిట ముగ్గులు వేస్తూ సందడి చేశారు. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి.

సమ్మెటివ్ పరీక్షలకు సర్వం సిద్ధం



మండల రీసోర్స్ సెంటర్ నుంచి ప్రశ్నాపత్రాలను పాఠశాలలకు తరలిస్తున్న ఎంఈఓ రాజబాబు

ప్రత్తిపాడు: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో సమ్మెటివ్ అసెస్‌మెంట్ – 1 పరీక్షల నిర్వహణకు మండల విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. జనవరి 2 నుంచి 10వ తేదీ వరకు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు. మండలంలోని 50 ప్రభుత్వ పాఠశాలల్లో 7,221 మంది, 23 ప్రైవేటు పాఠశాలల్లో 3,438 మంది వెరసి 73 పాఠశాలల్లోని 10,659 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రత్తిపాడు మండల రీసోర్సు సెంటర్ నుంచి శనివారం ప్రశ్నాపత్రాలను మండలంలోని పాఠశాలలకు తరలించారు.

పరీక్షల సమయం

ఈ నెల 2 నుంచి పదో తేదీ వరకూ 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు, 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకూ 1 నుంచి 5 తరగతుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రశ్నాపత్రం లీక్ కాకుండా విద్యాశాఖ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. ఒక వేళ ఎవరైనా ప్రశ్నా పత్రం లీక్ చేస్తే ప్రశ్నాపత్రంపై కేటాయించిన కోడ్ ప్రకారం ఏ పాఠశాల నుంచి లీక్ అయ్యిందో తెలిసిపోతుందని మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు తెలిపారు. 1 నుంచి 5 తరగతు ల విద్యార్థులు ఉదయం 10 గంటల నుంచి మధ్యా హ్నం 12.30 గంటల వరకూ, 6, 8, 10వ తరగతుల విద్యార్థులకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు, 7వ, 9వ తరగతులకు మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు.

విద్యార్థులకు చిరుధాన్యాలపై అవగాహన



తుని శ్రీప్రకాష్‌లో విద్యార్థులకు చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయిని

తుని: అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరాన్ని పురస్కరించుకొని స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థలో శనివారం చిరుధాన్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. 'మిరాకిల్ మిల్లెట్స్' పేరుతో చిరుధాన్యాల ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏయే చిరుధాన్యాల్లో ఏయే పోషక విలువలున్నాయనే దానిపై విద్యార్థులు ప్రదర్శనలు ఇచ్చారు. మన దేశంలో ఏ రాష్ట్రంలో ఏ చిరుధాన్యాలు పండిస్తారు, ఏ చిరుధాన్యం ఏమేర పోషకాలు అందిస్తుంది, వాటిని ఆహారంలో ఎలా సమతుల్యం చేసుకోవాలి తదితర అంశాలపై పాటలు, కథలు, ప్రాజెక్టులతో విద్యార్థులు వివరించారు. విద్యార్థులు చిరుధాన్యాలతో ఇంటి వద్ద తయారు చేసి తీసుకొచ్చిన వివిధ వంటకాలను ఒకరికొకరు పంచుకొని ఆస్వాదించారు. పాఠశాలలో చిరుధాన్యలతో తయారు చేసిన పాయసం ప్రత్యేకంగా వంటకంగా నిలిచింది. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కరప: సవిలే ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ద్వారా అంబేడ్కరిస్ట్ సవిలే రాజేష్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆ సంస్థ ముద్రించిన 'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్' 2023 సంవత్సర క్యాలెండర్‌ను ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి ఆవిష్కరించారు. తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, డీటీ కె.అనిల్‌కుమార్, ఆర్ఐ మాచర్రావు, ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు, సర్పంచులు సాదే ఆశాజ్యోతి, సవిలే నీలిమ, శ్రీనుబాబు పాల్గొన్నారు.

కల్యాణమస్తు

- పేదల వివాహానికి ప్రభుత్వ సాయం
- వైఎస్సార్ కల్యాణ మస్తు, షాదీ తోఫా అమలుకు చర్యలు

ప్రత్తిపాడు: పేదల వివాహానికి నగదు సాయం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో ఎన్నికల హామీ 'వైఎస్సార్ కల్యాణమస్తు' అమలు చేసేందుకు శ్రీకారం చుట్టారు. పేద, బడుగు, బలహీన వర్గాల వర్గాలకు చెందిన యువతులకు కల్యాణమస్తు, మైనారిటీ వర్గాలకు చెందిన యువతులకు షాదీ తోఫా పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. గతేడాది అక్టోబర్ 1 నుంచి వివాహాలు జరిగిన యువతుల నుంచి గ్రామ సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. ఇప్పటి వరకు పెద్దాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 29 దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు.

అర్హతలు ఇలా..

- పెళ్లి కుమార్తెకు 18 సంవత్సరాలు, పెండ్లి కుమారుడికి 21 సంవత్సరాల వయస్సు వివాహ సమయానికి పూర్తయి ఉండాలి.
- పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తె 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఇరు కుటుంబాలు బీపీఎల్ కేటగిరీకి చెందినవై ఉండాలి.

వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా ఆర్థిక సాయం వివరాలు

కులం	ఆర్థిక సాయం
ఎస్సీలు	రూ.1,00,000
ఎస్సీ కులాంతర వివాహం	రూ.1,20,000
ఎస్టీ కులాంతర వివాహం	రూ.1,20,000
బీసీలు	రూ.50,000
బీసీ కులాంతర వివాహం	రూ.75,000
దివ్యాంగులకు	రూ.1,50,000
భవన నిర్మాణ కార్మికులు	రూ.40,000

- 2022 అక్టోబర్ 1వ తేదీ నుంచి జరిగిన వివాహాలను పరిగణలోకి తీసుకుంటారు.
- భవన, ఇతర నిర్మాణ రంగంలోని వారైతే పెండ్లి కుమార్తె గాని, ఆమె తల్లిదండ్రులు గాని సంబంధిత వెల్ఫేర్ బోర్డులో రిజిస్టరై ఉండాలి.

దరఖాస్తు చేసుకునే విధానం ఇలా..

వివాహం జరిగిన 60 రోజుల లోపు ఆయా గ్రామ సచివాలయాల్లో నమోదు చేయించుకోవాలి. ఇందుకు నిబంధనల మేరకు వివాహ ధ్రువపత్రాలు దరఖాస్తులో పొందుపర్చాలి. ముఖ్యంగా పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెల పెళ్లి పత్రికలు, పెళ్లి సమయంలో తీయించిన ఫొటోలు, వివాహ ధ్రువీకరణ పత్రం, ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు పెండ్లి కుమార్తె బ్యాంకు ఖాతా జెరాక్స్ కాపీ, వధూవరుల విద్యార్హతలను (పదవ తరగతి ఉత్తీర్ణత) తెలిపే ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తుకు జత చేయాలి. భవన నిర్మాణ, ఇతర నిర్మాణ కార్మికులయితే కార్మిక సభ్యత్వ ధ్రువీకరణ పత్రం కూడా సమర్పించాలి.



వివాహ వేడుకలో వధూవరులు (ఫైల్)

సద్వినియోగం చేసుకోవాలి



పేదల వివాహాలకు ఆర్థిక సహాయం అందించేందుకు వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. కులాల వారీగా ఆర్థిక సాయంతో పాటు కులాంతర వివాహాల ప్రోత్సాహానికి కూడా అదనపు సాయం అందిస్తోంది.అర్హతలుండి వివాహాలు జరిగిన వెంటనే దంపతులు ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో వివాహ ధ్రువీకరణ పత్రంతో దరఖాస్తు చేసుకోవాలి. గ్రామాల్లో పథకంపై విస్తృత ప్రచారంతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం.

– కేఎస్‌వీ ప్రసాదరావు, డీడీఓ, పెద్దాపురం

మనసు మురిసేలా.. కళ్లు చెదిరేలా..

SUNDAY SPECIAL



వెంకన్న గాలిగోపురం సాక్షిగా బాలికల కోలాట నృత్యోత్సాహం

- మంత్రముగ్ధుల్ని చేస్తున్న కోలాట ప్రదర్శన
- ప్రదర్శనతో కట్టిపడేస్తున్న కళాకారులు
- అపురూప కళారూపానికి టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ఊపిరి
- వేలాది మందికి శిక్షణ

సాక్షి అమలాపురం: ప్రజల జీవితాలతో పెనవేసుకుపోయిన అనేకానేక జానపద కళారూపాల్లో కోలాట నృత్యం ఒకటి. ఒకనాటి గ్రామీణ, పట్టణ ప్రజలకు అందుబాటులో ఉన్న వినోదాల్లో ఇదొకటి. ప్రతి పల్లెలో సాయంత్రం నుంచి రాత్రి పొద్దు పోయే వరకూ కోలాం ప్రదర్శిస్తూండే వారు. దేవుని పల్లకీతో వీధుల్లో తిరిగి ప్రతీ ఇంటి ముందూ కోలాటాన్ని భక్తిభావంతో ప్రదర్శించేవారు. తీర్థాలు, జాతరలు, దేవుళ్ల ఉత్సవాలు.. ఊరేగింపుల్లో కోలాట నృత్యం తప్పనిసరి. టీవీలు వచ్చిన తరువాత వీటి ఉనికి తగ్గిపోతున్నా.. ఇప్పటికీ పెద్దల్నీ.. పిల్లల్నీ కోలాటం ఆకట్టుకుంటూనే ఉంది. ఉనికి కోల్పోతున్న ఈ అపురూప కళారూపానికి తిరుమల తిరుపతి దేవస్థానం దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యాన హరే శ్రీనివాస నిత్య కోలాట భజన మండలి దీనిని కొనసాగిస్తోంది. పిల్లలకు, యువతీ యువకులకు శిక్షణ ఇస్తూ కోలాటానికి జీవం పోస్తోంది.

సుదీర్ఘ చరిత్ర

- కోలాటానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. 'పండితారాధ్య చరిత్ర'లో పాల్కురికి సోమనాథుడు అనేక జానపద కళారూపాలను వర్ణిస్తూ కోలాటాన్ని 'కోలాట గొడియ' అని పేర్కొన్నాడు. విజయనగర సామ్రాజ్య కాలంలో కోలాటం ఒక వెలుగు వెలిగిందని పెద్దలు చెబుతారు. విజయనగర శిథిలాల్లో, శ్రీశైల దేవాలయ గోపురాలపై కోలాట నర్తకీమణుల శిల్పాలు ఉన్నాయంటారు.
- కోలాటానికి ఉపయోగించే చిడతల తయారీకి చేవ కలిగిన బిల్లుడు, చంద్ర, వేప, రేల, టేకు, ఏగిస తదితర జాతుల చెట్ల కర్రలను ఎంచుకుంటారు. వాటిని సరైన సైజులో కోసి, చక్కగా చిత్రీ పట్టి, పిడి వద్ద అందెలు, కోల చివర గజ్జెలనూ ఏర్పాటు చేస్తారు.
- కోలాటం ఆడేటప్పుడు వచ్చే ధ్వని మధురంగా వుంటుంది. ఆటగాళ్లందరూ కాళ్లకు గజ్జెలు కట్టుకుని, పాటకు లయబద్ధంగా ప్రదర్శన చేస్తారు. అలాగే కోలాట బృందం మధ్యలో వాయిద్యకారులుంటారు. డోలక్, హార్మోనియం, తప్పెట, తాలు వంటివి కూడా వినియోగిస్తారు. పల్లెల్లో రైతులు, గ్రామికులు తమ రోజువారీ వ్యవసాయ, ఇతర పనులు ముగించుకుని సాయంత్రానికి ఇళ్లకు చేరుకుంటారు. వారు రాత్రి భోజనాలు చేసిన తరువాత కోలాట కళాకారులు తమ ప్రదర్శనలు ప్రారంభిస్తారు.

ఎన్నో రకాలు

కోలాట ప్రదర్శనలో పలు రకాలున్నాయి. ఒక్కో దానికి ఒక్కో గుర్తింపు.

బిందెల కోలాటం : గోపికలు శ్రీకృష్ణుని ముందు చేసిన నృత్యానికి రూపం.

మురళీ కోరాటం : శ్రీకృష్ణుడు గోపాలకులతో ఆడిన ఆటలు.

జెండాల కోలాటం : ఆంజనేయ స్వామి లంకా దహనానికి రూపం.

పాము కోలాటం : సుబ్రహ్మణ్యస్వామికి నృత్య రూపం.

హారతి కోలాటం : లోకం సుభిక్షంగా ఉండేందుకు నిర్వహించే నృత్యరూపకం.

జడ అల్ల కోలాటం : తిరుపతిలో అమ్మవారి జడలను పోలేటట్టు ఉండే నృత్యరూపకం.

కోలాటాన్ని తొలి రోజుల్లో పురుషులు చేసేవారు. తరువాత మహిళలు కూడా నేర్చుకున్నాక ఈ కళారూపం కొత్త కళను సంతరించుకుంది.

టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ప్రోత్సాహం

కోలాటానికి టీటీడీ దాస్య సాహిత్య ప్రాజెక్టు ప్రోత్సాహమిస్తోంది. ప్రాజెక్టు కన్వీనర్ పగడాల ఆనంద తీర్థాచార్యులు ఆధ్వర్యాన గడచిన నాలుగు దశాబ్దాలుగా రాష్ట్రంలో 8 వేల కోలాట భజన కేంద్రాలు ఏర్పాటు చేశారు. కన్నడ నాట పురందర దాసు సంకీర్తనలు గ్రామగ్రామానా వినిపించాలనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టు ప్రారంభించారు.

వృత్తి ఫొటోగ్రఫీ.. ప్రవృత్తి కోలాటం

పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం సమీపంలోని ప్రత్తిపాడుకు చెందిన బి.ఈశ్వర్ కోలాట నృత్యాన్ని ఇప్పటి వరకూ వందల మందికి నేర్పించాడు. చిన్నప్పుడు నేర్చుకున్న కోలాటం కళకు అంకితమైపోయాడు. ఒకవైపు ఫొటోగ్రఫీ వృత్తిలో ఉంటూనే.. మరోవైపు పట్టణాలు, పల్లెలకు వెళ్తూ కోలాటం నేర్పుతున్నాడు. ఇప్పటి వరకూ 50కి పైగా కోలాట భజన బృందాలకు శిక్షణ ఇచ్చారు. వీటిలో 70 నుంచి 100 మంది వరకూ శిక్షణ పొందిన వారున్నారు. తాజాగా అమలాపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద ఈశ్వర్ కోలాటం నేర్పుతున్నాడు. అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు, అయినవిల్లి మండలం నల్లచెరువు, అమలాపురం పట్టణం, కామనగరువు వంటి ప్రాంతాల నుంచి పిల్లలు, యువతీయువకులు, మహిళలు 200 మంది వరకూ ఇక్కడ కోలాటంలో శిక్షణ పొందుతున్నారు. పర్వదినాలు, ఇతర ప్రధాన రోజుల్లో ఆలయం వద్ద వీరు నిర్వహిస్తున్న కోలాట నృత్య ప్రదర్శన భక్తులను, వీక్షకులను మంత్రముగ్ధులను చేస్తోంది.





కోలాట నృత్య ప్రదర్శనకు సిద్ధమవుతున్న బాలిక



అమలాపురం శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో కోలాట ప్రదర్శన



బిందెల కోలాటానికి ఏర్పాట్లు

నేను కూడా వదిలేస్తే ఎలా?



చిన్ననాటి నుంచీ కోలాటం నేర్చుకుంటున్నాను. ఈ కళ అంటే మక్కువ. దీనిని నలుగురికీ నేర్పాలి.. అందరికీ పంచాలన్నదే లక్ష్యం. నేను కూడా వదిలేస్తే ఎలా? ఈ కళకు నా వంతు సేవ చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాను. టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు మాకు ప్రోత్సాహమిస్తోంది.

– జి.ఈశ్వర్

నేటి నుంచి మరింత మురిపెంఛన్

ప్రత్తిపాడు: అవ్వాతాతలు, వితంతువులు, వికలాంగులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. వారికి ప్రతి నెలా అందించే పింఛన్ సొమ్మును పెంచింది. నూతన సంవత్సర కానుకగా పెంచిన మొత్తాన్ని లబ్ధిదారులు తీసుకోనున్నారు. పింఛన్ సొమ్ము రూ.3 వేల వరకు పెంచుకుంటూ పోతామని ఎన్నికల ముందు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగానే జనవరి నెల నుంచి మరో రూ.250 పెంచారు. దీంతో ఇప్పటివరకూ రూ.2500 పింఛను పొందుతున్న వృద్ధులు, వికలాంగులు ఇకపై రూ.2,750 పొందనున్నారు. ఈ పెంపుదలతో మండలంలోని 26 గ్రామ సచివాలయాల పరిధిలో వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా 11,519 మంది లబ్ధిదారులకు మేలు జరగనుంది.

561 మందికి పింఛన్ల మంజూరు

తుని రూరల్: మండలంలో 561 మందికి కొత్తగా సామాజిక పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ ఎస్.సుబ్రహ్మణ్యశర్మ శనివారం తెలిపారు. కొత్తగా మంజూరైన పింఛన్లకు సంబంధించి లబ్ధిదారుల సమగ్ర పరిశీలన పూర్తయ్యిందన్నారు. వీరందరికీ ఈ నెల 3న రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా పింఛన్లు అందజేస్తారన్నారు. ఇప్పటికే ఉన్న 11,547 మంది లబ్ధిదారులకు జనవరి ఒకటి నుంచి పింఛన్ల సొమ్ము అందజేయనున్నట్టు ఎంపీడీఓ సుబ్రహ్మణ్య శర్మ వివరించారు. కొత్త, పాత పింఛన్ లబ్ధిదారుల సంఖ్య మొత్తం 12,108కి చేరిందని తెలిపారు.

శంఖవరం మండలంలో 236 మందికి..

శంఖవరం: మండలంలో కొత్తగా 236 మందికి పింఛన్లు మంజూరైనట్టు ఎంపీడీఓ జె.రాంబాబు తెలిపారు. లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన పింఛన్లను ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ పంపిణీ చేస్తారని చెప్పారు.



ప్రత్తిపాడులో వృద్ధురాలికి పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

సృజనాత్మకతను పెంపొందించుకోవాలి



ధర్మవరంలో విద్యార్థులు తయారు చేసిన బొమ్మలను పరిశీలిస్తున్న ఎంఈఓ రాజబాబు

ప్రత్తిపాడు రూరల్: విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని ఎంఈఓ వి. రాజబాబు సూచించారు. మండలంలోని ధర్మవరం ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల వస్తువులు, బొమ్మలను శనివారం ఆయన పరిశీలించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు రకాల బొమ్మలు, వస్తువులు స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల పీఎంసీ చైర్మన్ కురుపుడి గంగాభవానీ, హెచ్ఎం సీహెచ్ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చురుగ్గా రహదారి నిర్మాణపనులు



బెండపూడి-పి.చిన్నాయపాలెం రహదారి నిర్మాణ పనులు

తొండంగి: మండలంలోని పి.ఇ.చిన్నాయపాలెంలో రహదారి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మండల పరిధిలోని పలు రహదారుల అభివృద్ధికి రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా రూ.2 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో బెండపూడి జాతీయ రహదారి నుంచి పి.ఇ.చిన్నాయపాలెం, అక్కడి నుంచి రావికంపాడు వరకూ సుమారు 5 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణపనులు ప్రారంభించారు. నాణ్యతా ప్రమాణాలతో రహదారి అభివృద్ధి పనులు చేపట్టినట్టు ఆర్అండ్‌బీ ఏఈ రమణ తెలిపారు. మరో వారం రోజుల్లో పనులు పూర్తవుతాయని చెప్పారు.

వికాస ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



శిబిరాన్ని పరిశీలిస్తున్న జేసీ ఇలక్కియ

కాకినాడ సిటీ: కాకినాడ జిల్లా వికాస సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ ప్రారంభించారు. జేసీ ఇలక్కియ మాట్లాడుతూ వికాస ఆధ్వర్యంలో రక్తదానం వంటి సామాజిక సేవ కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.హేమలత, జీజీహెచ్ మెడికల్ ఆఫీసర్ డి.శారదాదేవి పాల్గొన్నారు.

సప్తద్వార దర్శనానికి ఏర్పాట్లు

బోట్‌క్లబ్: స్థానిక పళ్లంరాజునగర్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఈ నెల 2న సప్తద్వార ఉత్తర దర్శనానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి సత్యనారాయణాచార్యులు శనివారం తెలిపారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని అన్నారు. దీని ద్వారా కోటి యజ్ఞాల చేసిన ఫలితం భక్తులకు లభిస్తుందన్నారు.

సేవలు అభినందనీయం

బోట్‌క్లబ్: వాసవీ వైశ్య ఫ్రెండ్స్ కన్వీనర్ చెక్కా రమేష్ ఆధ్వర్యంలో స్థానిక వార్ఫు రోడ్డులోని వాసవీ కన్యాకా పరమేశ్వరి సత్రంలో శనివారం ధనుర్మాస ప్రసాద వితరణ చేశారు. దీనిని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పెద్ది రత్నాజీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పైడా కృష్ణమోహన్, రాష్ట్ర మేధావి విభాగం కన్వీనర్ ముత్తా నవీన్ ప్రారంభించారు. కృష్ణమోహన్ మాట్లాడుతూ వాసవీ వైశ్య ఫ్రెండ్స్ సేవలు అభినందనీయమన్నారు. పైడా భవన ప్రసాద్, పైడా వెంకటనారాయణ, సభ్యులు పెనుమూడి వినోద్, బోడ గోపి తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలపై దృష్టి సారించాలి



విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న కళాశాల ఏడీ బీఇవీఎల్ నాయుడు

బాలాజీచెరువు: సైన్స్ విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని ఆదిత్య డిగ్రీ కళాశాల ఏడీ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు అన్నారు. స్థానిక ఆదిత్య మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన డేటాన్వేష్ ఫెస్ట్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ రంగంలో పైథాన్, మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి కోర్సులకు డిమాండ్ ఉందని, వీటిపై ప్రాజెక్టులు రూపొందించాలని సూచించారు. ప్రిన్సిపాల్ కరుణ, వైస్ ప్రిన్సిపాల్ నాగశ్రీకాంత్, కంప్యూటర్ హెడ్ అల్లూరి సామ్యూల్, అధ్యాపకులు చిరంజీవి పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్లకు అవార్డులు

గండేపల్లి/జగ్గంపేట: కాకినాడ జిల్లాలో కేసుల పరిష్కారంలో జగ్గంపేట పోలీస్ స్టేషన్ రెండో స్థానంలోనూ, గండేపల్లి మూడో స్థానంలోనూ, కిర్లంపూడి పోలీస్ స్టేషన్ నాల్గో స్థానంలోనూ నిలిచాయి. ఈ మేరకు ఆయా స్టేషన్లలో విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన సీఐ బి.సూర్యఅప్పారావు, ఎస్సైలు వై.గణేష్ కుమార్, రఘునాథరావు, బి.తిరుపతిరావులను జిల్లా ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు అభినందించి అవార్డులు అందజేశారు. జగ్గంపేట పోలీస్ సర్కిల్ పరిధిలోని స్టేషన్ల పనితీరు బాగుందని, రానున్న రోజుల్లో మరింత మెరుగైన పనితీరును కనబరచాలని ఆయన ఆకాంక్షించారు. అవార్డులు పొందిన పోలీసు అధికారులను ఎంపీపీలు చలగళ్ల దొరబాబు, అత్తులూరి నాగబాబు, తోట రవి, వైస్ ఎంపీపీ కుంచే రాజా తదితరులు అభినందించారు.